ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

శుక్రవారం 1 మార్చి 2024

'తుళు'కు రెండో అధికార భాష హోదా..!

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను వేనోళ్ళా కొనియాడిన విజయనగర పాలకుడు శ్రీకృష్ణదేవరాయల మాతృభాషగా ఉన్న తుళుకు రెండో అధికార భాష హోదా కల్పించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శాసనసభలో కన్నడ సాంస్కృతిక శాఖా మంత్రి శివరాజ్ తంగడగి గురువారం ఈ విషయం ప్రకటించారు. రెండో అధికార భాషను అమల్లోకి తెచ్చిన బీహార్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఉన్నతాధికారుల బృందం పర్యటించి నివేదిక సమర్పిస్తుందని అనంతరం న్యాయశాఖకు దీన్ని పంపుతామన్నారు. న్యాయశాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తూనే అధికారికంగా ప్రకటిస్తామన్నారు.

దేశ ద్రోహులపై ఉదాసీనతా..?



శాసనసభలో మాట్లాడుతున్న సీఎం సిద్ధరామయ్య

- పాకిస్తాన్‌కు జై కొట్టినా అరెస్ట్ చేయరా..?
- దేశవ్యతిరేక నినాదాలపై బీజేపీ ఆగ్రహం
- అసెంబ్లీ నుంచి వాకౌట్

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి సమయం లేదా..దేశద్రోహులపై ఇంత ఉదాసీనతా అంటూ బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యతిరేక నినాదాలపై బీజేపీ రెండో రోజూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజ్యసభ ఎన్నికల ఫలితాల వేళ కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందిన నిసార్ అహ్మద్ కోసం వచ్చిన వ్యక్తి విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ అనే నినాదాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ సభ్యులు మండిపడ్డారు. గురువారం సభ ప్రారంభం కాగానే బడ్జెట్‌పై సీఎం సిద్దరామయ్య ప్రసంగించేందుకు సిద్ధం కాగా ప్రతిపక్షనేత అశోక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసి 40గంటలు గడిచినా చర్యలు లేకపోవడాన్ని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరిని రక్షించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బీజేపీ సభ్యులు పోడియంలోకి దూసుకెళ్ళి నిరసన చేపట్టారు. సుమారు అరగంట పాటు సభ గందరగోళంగా కొనసాగింది. అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతోందని దేశద్రోహులను బంధించి కఠినంగా శిక్షించే ప్రయత్నం చేయడం లేదన్నారు. సభలో సీనియర్ సభ్యుడని ఇంతటి నిర్లక్ష్యం గతంలోఎన్నడూ చూడలేదన్నారు. మల్లికార్జునఖర్గే హోంమంత్రిగా ఉన్నప్పుడు దళిత సముదాయానికి చెందిన ఆరుగురిని సజీవదహనం చేసిన సంఘటనపై సభలోనే కన్నీరు పెట్టారన్నారు. కానీ ప్రస్తుతం హోంమంత్రి నిర్లక్ష్యంగా ఉన్నారని ఏకంగా విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు చేసినా పట్టించుకోలేదన్నారు. వీరు అధికారంలో ఉండేందుకు అర్హులు కారన్నారు. ఇదే సందర్భంలో హోంమంత్రి పరమేశ్వర్ జోక్యం చేసుకుని ఫోరెన్సిక్ నివేదిక వచ్చాక చర్యలు ఉంటాయన్నారు. ఏడుమంది నుంచి వివరాలు సేకరించామని తీవ్రంగా పరిగణించామన్నారు. దేశభక్తిని వీరి నుంచి తెలుసుకోవాల్సిన పనిలేదన్నారు. ఎవరినీ రక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఓవైపు బీజేపీ సభ్యులు పోడియంలో ఉండగానే సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌పై చర్చను ఆరంభించారు. తొలుత సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వా గ్వాదం మధ్యనే సీఎం చర్చ కొనసాగిస్తుండగా బీజేపీ సభ్యులు నినాదాలు చేసుకుంటూ వాకౌట్ చేశారు.



విధానసౌధ గేట్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రతిపక్ష నేత అశోక్, బీజేపీ, జేడీఎస్ సభ్యులు

అధికారంలో ఉంటే కాల్చిపారేసే వాళ్లం

- ప్రతిపక్ష నేత అశోక్

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసిన దేశద్రోహుల్ని తుపాకీతో కాల్చిపారేసి ఉండేవాళ్ళమని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ పేర్కొన్నారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విధానసౌధలో ఎమర్జెన్సీ తరహా వాతావరణం కనిపిస్తోందన్నారు. శాసనసభలో తాము ధర్నా చేసిన సమయంలోనూ సెన్సార్ విధించారని ఆయన ఆరోపించారు. కాగా మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై మీడియాతో మాట్లాడుతూ సిద్దరామయ్య ప్రవేశ పెట్టిన బడ్జెట్ అబద్ధాల పుట్టగా ఉందని రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన వారిని రక్షిస్తూ ఇప్పుడు నైతికంగా కూడా దివాళా తీసిందన్నారు. ఈ అంశాలను తమ పార్టీ బలంగా ప్రజల్లోకి తీసుకెళుతుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీరాములు

సిగ్గులేదా..?

- భారతదేశంలో ఉంటూ పాకిస్తాన్‌కు జై కొడతారా..?
- మాజీ ఎంపీ శ్రీరాములు ఆగ్రహం

బళ్లారి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఇండియాలో ఉంటూ.. ఇక్కడి గాలి పీలుస్తూ.. పాకిస్తాన్ జిందాబాద్ అనేందుకు కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు నాసీర్ హుసేన్ కు సిగ్గుగా లేదా అని బీజేపీ నాయకుడు మాజీ మంత్రి శ్రీరాములు ప్రశ్నించారు. గురువారం శ్రీరాములు నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధానసౌధలో ఎంపీ నాసీర్ హుసేన్ అనుచరులు, పాకిస్తాన్ జిందాబాద్ అనడం వీడియాల్లో చూశానన్నారు. కాంగ్రెస్ నాయకులు దేశద్రోహానికి పాల్పడడం సిగ్గుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గాలి జనార్దన్‌రెడ్డి బీజేపీలోకి వస్తే స్వాగతిస్తా నన్నారు. తన సోదరి శాంత హిందూపురం ఎంపీగా పోటీ చేయడంపై ప్రశ్నించగా అది వారి మెట్టినింటి వ్యవహారమన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు ఓబుశేశ్, మాజీ బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, తిమ్మప్ప పాల్గొన్నారు.

పరిషత్‌లోనూ విరుచుకుపడ్డ ప్రతిపక్షాలు..



స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టిన బీజేపీ సభ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల ముగింపు రోజు పరిషత్‌లో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ సభ్యులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కలాపాలు ఆరంభం కాగానే విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు చేసిన వారిని అరెస్టు చేయలేరా అంటూ ప్రతిపక్షనేత కోటా శ్రీనివాస పూజారి మండిపడ్డారు. ఇదే సందర్భంలోనే అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్యన బుధవారం తరహాలోనే మరోసారి వాగ్వాదం జరిగింది. దీంతో బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరంబడ్జెట్‌పై జేడీఎస్ సభ్యుడు మరితిబ్బేగౌడ సుదీర్ఘంగా ప్రసంగించారు. సీఎం, డీసీఎంలను పొగడ్తలతో ముంచెత్తారు. సీఎం సిద్దరామయ్యను పలుమార్లు శ్రీరాముడితో పోల్చారు. అనంతరం జేడీఎస్ సభ్యుడు ఫరూక్ మాట్లాడుతూ మైనార్టీలకు బడ్జెట్‌లో అన్యాయంపై ప్రశ్నించారు. మంగళూరు హజ్‌భవన్‌కు పదేళ్ళకిందట పది కోట్లు కేటాయించారని ఇప్పటిదాకా కనీసం స్థలం కూడా ఎంపిక కాలేదన్నారు. పదికోట్లకు వచ్చిన వడ్డీతో హజ్‌భవన్ నిర్మాణం సరికాదన్నారు. బడ్జెట్‌లో అవే నిధులు చూపుతారా లేక కొత్తగా గ్రాంట్ విడుదల చేస్తారా అంటూ ప్రశ్నించారు. కాగా సభలో బీజేపీ, జేడీఎస్ సభ్యులు వాకౌట్ చేయగా జేడీఎస్ రెబల్ మరితిబ్బేగౌడ, బీజేపీ రెబల్ విశ్వనాథ్‌లు ప్రభుత్వాన్ని, సీఎం సిద్దరామయ్యను పొగుడుతూ బడ్జెట్‌ను కొనియాడారు. అనంతరం బడ్జెట్‌పై సీఎం సిద్దరామయ్య శాసనసభలో ప్రస్తావించిన అంశాలతోనే వివరణ ఇచ్చారు. బడ్జెట్ బిల్లుకు ఆమోదం తెలిపారు. శాసనసభలో అంగీకృతమై పెండింగ్‌లో ఉండే హిందూ ధార్మిక బిల్లు మరోసారి తిరస్కరణకు గురైంది. శాసనసభలో ప్రవేశపెట్టిన అన్ని బిల్లులను సభానాయకుడి హోదాలో మంత్రి బోసురాజు ప్రవేశపెట్టగా అంగీకరింపబడ్డాయి. బడ్జెట్‌పై సీఎం ప్రసంగించే వేళ బీజేపీ సభ్యులు హాజరయ్యారు. ఉభయసభలను నిరవధిక వాయిదా వేశారు.

హరోం...హర అమృతేశ్వరా..!



అమృతేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించిన స్పటిక లింగం

- భక్తి శ్రద్ధలతో స్పటికలింగ ప్రతిష్ఠ
- భక్తులతో కిటకిటలాడిన బళ్లారి
- హాజరైన సినీ ప్రముఖులు

బళ్లారి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం భక్తజన సందోహంగా మారింది. నగరానికి సమీపంలోని బాలాజీ నగర్ క్యాంపులో నూతనంగా నిర్మించిన అమృతేశ్వర ఆలయంలో గురువారం స్పటికలింగ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. హరహరపుర శక్తిపీఠం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమంలో సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. పూజల్లో దర్శకులు రాజమౌళి, నిర్మాత కొర్రపాటి సాయి. సంగీత దర్శకుడు ఎం.ఎం కిరవాణి, కన్నడ నటుడు యశ్, సింగర్ మంగ్లీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని బళ్లారి పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు. ఉదయం రుద్ర పారాయణం, మహామంగళ హారతి, కుంబాభిషేకం నిర్వహించారు. ఆలయంలో గణపతి వారాహి , లక్ష్మీనరహింహ స్వామి , లక్ష్మి, పార్వతి, సర్వతి, తదితర విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. కృష్ణ శిలతో నిర్మించిన ఆలయాన్ని దర్శించుకునేందుకు ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. గాయని మంగ్లీ పాటలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నటుడు యశ్‌ను చూసేందుకు అభిమానులు తండోపతండాలుగా తరలి వచ్చారు.



పూజల్లో పాల్గొన్న రాజమౌళి, కొర్రపాటి సాయి తదితరులు

బీబీఎంపీ బడ్జెట్‌లో బ్రాండ్ బెంగళూరుకు పెద్దపీట

- రూ 12,371.63 కోట్ల ఆదాయం
- రూ. 12,369.46 కోట్ల ఖర్చు అంచనా
- మిగులు రూ. 2.17 కోట్లు

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికెకు ఇంకా ఎన్నికలు జరుగాల్సి ఉన్నందున అధికారులే గురువారం 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బీబీఎంపి ఆర్థిక విభాగం స్పెషల్‌కమీషనర్ శివానంద్ కలగేరి బడ్జెట్ విశేషాలను మీడియాతో పంచుకున్నారు. బడ్జెట్‌లో సిలికాన్ సిటీ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకించి బ్రాండ్ బెంగళూరు పరికల్పనను సాకారం చేసేందదుకు పెద్దపీట వేశామని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి వాల్యూబేస్డ్ ఆస్తిపన్నుల విధానాన్ని అమల్లోకి తీసుకురాబోతున్నట్లు ఆయన ప్రకటించారు. బీబీఎంపి బడ్జెట్‌లో రూ 12,371.63 కోట్ల ఆదాయాన్ని నిరీక్షిస్తున్నారు. ఇదే సమయంలో ఖర్చు గాత్రం రూ 12,369.46 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఈ లెక్కన బడ్జెట్ మిగులు రూ 2.17కోట్లుగా చూపారు.

రెవెన్యూ..

బీబీఎంపీ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకునేందుకుగాను 20 లక్షల ఆస్తులను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. కావేరి-2 సాఫ్ట్‌వేర్ సాయంతో నమ్మసొత్తు వ్యవస్థను పక్కాగా అమల్లోకి తీసుకురానున్నారు. నగరంలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకోసం ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని అమల్లోకి తెస్తారు.ఫలితంగా 15 లక్షల మందికి ప్రయోజనం దక్కనుందని అంచనా వేశారు. కొత్త ప్రకటనల విధానాన్ని అమల్లోకి తీసుకురావడం ద్వారా బీబీబీఎంపికి కనీసం రూ 500కోట్ల ఆదాయం లభించేలా చేయనున్నారు. ఆస్తిపన్నుల ద్వారా కనీసం 6వేల కోట్ల ఆదాయాన్ని పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బ్రాండ్ బెంగళూరు పరికల్పనకోసం రూ1580 కోట్లు ఖర్చుచేయనున్నారు. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ మెరుగుపరిచేందుకు రూ 200కోట్లు ఖర్చుచేయనున్నారు. రహదారులను విస్తరించేందుకు రూ 130కోట్లు ఖర్చుచేయతలపెట్టారు. రాజకాలువ దారుల అభివృద్ధికి రూ 100కోట్లు, గుంతలు లేని రహదారుల వైట్‌టాపింగ్‌కోసం రూ 300 కోట్లు,మెట్రో రైలు మార్గాల్లో వంతెనలనిర్మాణానికి రూ 100కోట్లు కేటాయించారు. మొత్తం 225 వార్డుల నిర్వహణ కోసం ప్రతి వార్డుకు రూ 75 లక్షల చొప్పున రూ 125 కోట్లు కేటాయించారు.

స్వచ్ఛ బెంగళూరు కోసం...

నగర స్వచ్ఛతను కాపాడే దిశలో నగరం నలుమూలలా చెత్త డంపింగ్ కోసం 50 నుంచి 100 ఎకరాల స్థలాన్ని గుర్తించి దీనిని కొనుగోలు చేసేందుకు రూ 100కోట్లు కేటాయించారు. నగరవ్యాప్తంగా మహిళలకోసమే ప్రత్యేకంగా 100 మరుగుదొడ్లను నిర్మించనున్నారు. జలమండలికి బడ్జెట్‌లో రూ 1000కోట్లు కేటాయించారు. నగరవ్యాప్తంగా ప్రస్తుత ఏడాది 2 లక్షల మొక్కలను నాటనున్నారు. నగరంలోని కొత్త లేఅవుట్‌లలో పార్కుల అభివృద్ధికి రూ 35 కోట్లు కేటాయించారు. చెరువులు కబ్జాకు గురికాకుండా ఉండేందుకు రూ 35 కోట్లతో కంచెను ఏర్పాటు చేయనున్నారు.

విద్యారంగానికి..

బీబీఎంపి నిర్వహణలోని పాఠశాలలు, కళాశాలల్లో కంప్యూటర్ లేబోరేటరీల ఏర్పాటు, డిజిటల్ ల్యాబ్‌ల ఏర్పాటు ఐటి ల్యాబ్‌ల ఏర్పాటు సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు గ్రంథాలయాల ఏర్పాటు కోసం రూ 10కోట్లు కేటాయించారు.

నగరానికి ప్రత్యేక ఆకర్షణ

కాగా రూ 350 కోట్ల ఖర్చుతో నగరంలో 255 మీటర్ల ఎత్తయిన స్కైడెక్‌ను నిర్మించనున్నారు. అయితే ఇందుకు ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో రూ 50 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రయివేటు రంగం సహకారంతో ఈ ప్రాజెక్టునుపూర్తిచేయనున్నారు. నగరానికి రానున్న రోజుల్లో ఇదొక ప్రత్యేక ఆకర్షణ కానుంది.



బడ్జెట్ ప్రతులతో వస్తున్న బీబీఎంపీ ఉన్నతాధికారులు

కార్మికుల సంక్షేమానికి

బీబీఎంపి కార్మికుల పింఛను కోసం బడ్జెట్‌లో రూ 137.50 కేటాయించారు. పౌరకార్మికులకు వివిధ వాహనాల కొనుగోలు కోసం రూ 12 కోట్లు కేటాయించారు.

ఆరోగ్య బెంగళూరు

ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో రూ 100 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పౌరకార్మికుల, నగర ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం మరిన్ని కార్యక్రమాలుచేపడతారు. బీబీఎంపిలో ప్రత్యేక ఆరోగ్య కమీషనర్‌పదవిని సృష్టించనున్నారు. బెంగళూరు దేవనహళ్ళిలోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు నగరవ్యాప్తంగా కొత్తగా మరో 50 ఇందిరా క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. స్మశానాల ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కోసం రూ 15 కోట్లు కేటాయించారు. నగర సమగ్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చామని ఆయన మీడియాకు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై బ్యాంకర్ల కమిటీ ప్రత్యేక సమీక్ష

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 164వ సమావేశం విధానసౌధలో ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి షాలినీ రజనీష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ పిఎస్.రఘునాథ్, జనరల్ మేనేజర్ సునందా బాత్రా, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ టి.రమేష్, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ ఎం.భాస్కర చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా పథకం, ప్రధాన మంత్రి సురక్షా బీమా పథకాల అమలు ప్రగతిని ప్రత్యేకంగా సమీక్షించారు. అర్హులందరికీ ఈ పథకాలు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. కాగా ప్రభుత్వ పథకాల అమలులో లక్ష్యాలను అందుకుంటున్న బ్యాంకులను సమావేశంలో ప్రత్యేకంగా అభినందించారు. కెనరాబ్యాంకు ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకాల అమలులో లక్ష్యాలను సాధించామని కెనరాబ్యాంకు నగరంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.




బ్యాంకర్లతో సమావేశంలో ప్రభుత్వ అదనపు ముఖ్యకార్యదర్శి షాలినీ రజనీష్

నేటి నుంచి పీయూసీ పరీక్షలు

- రాష్ట్రవ్యాప్తంగా 1124 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 6.9 లక్షల మంది విద్యార్థులు

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ద్వితీయ పీయుసి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పీయూసీ బోర్డు అధికారులు గురువారం వెల్లడించారు. పరీక్షలు రాసేందుకు మొత్తం 6.90 లక్షల మంది విద్యార్థులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని శుక్రవారం ఉదయం కన్నడ మధ్యాహ్నం అరబిక్ పరీక్షలు ఉంటాయన్నారు. మార్చి 22 వరకు జరిగే ఈ పరీక్షలు సాఫీగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక విజిలెన్స్ దళాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ ఉంటుందని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1124 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ కళాశాల ఐడెంటిటీ కార్డుతో పాటు హాల్ టికెట్‌ను తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా వచ్చి తమ రిజిష్టర్ నెంబర్లు ఏ గదిలో ఉన్నాయో సరిచూసుకోవాలని కోరారు. ఎలాంటి భయాందోళనలకు, ఒత్తిళ్ళకు లోనుకాకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు జరిగే అన్ని గదుల వద్దా సీసీటీవీల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టు పక్కల జిరాక్స్ సెంటర్లను మూసేయాలని ఆదేశించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధి వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, విద్యాశాఖా మంత్రి మధుబంగారప్ప శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆకాంక్షించారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.90	1,605.43
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	893	8,047
సామర్థ్యం (టీఎంసీలు)	8.63	29.11

వైభవంగా సేవాలాల్ జయంతి



సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

హొసపేట,ఫిబ్రవరి 29: విజయనగరం జిల్లా హొస పేటలో సేవాలాల్ జయంతోత్సవాలను బంజరా సమాజం ఘనంగా నిర్వహించింది. సేవాలాల్‌కు నివాళులర్పించిన అనంతరం ఊరేగింపు సన్నక్కి వీరభద్రేశ్వరాలయం నుంచి వాల్మీకి సర్కిల్, గాంధీచౌక్, పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఇండోర్‌స్టేడియం చేరుకుంది. ఊరేగింపులో వందలాది మంది బంజారా సంఘం ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ తాలుకా అధ్యక్షుడిగా మల్లికార్జున స్వామి



సిరుగుప్ప, ఫిబ్రవరి 29 : బీజేపీ సిరుగుప్ప తాలుకా నూతన పదాధికారులను ఎన్నుకున్నట్లు తాలుకా అధ్యక్షుడు కుంటనాళ్ మల్లికార్జునస్వామి వెల్లడించారు. గురువారం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ బీజేపీ రాజ్యాధ్యక్షులు వైవి విజయేంద్ర, జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప సలహాలు, సూచనల మేరకు తాలుకా సమితికి నూతన పదాధికారులను ఎన్నుకోవడం జరిగినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులుగా మధుసూదన శెట్టి, కంబ్లి మల్లికార్జున, అమరేష్ గౌడ, గాదెలింగ, వీరయ్య, మాదెన్న, ప్రధాన కార్యదర్శులుగా బెళగల్ బసవరాజ, పక్కీరయ్య, కోశాధికారిగా రాధా శ్యామ్, కార్యదర్శులుగా గంగాధర, పెద్దమ్మ, కొండయ్యలు నియమితులైనట్లు ఆయన తెలిపారు.

పట్టాలు ఇచ్చే వరకు నిరసనలు తప్పవు



పట్టాల కోసం నిరసన చేపట్టిన రైతులు

కంప్లి, ఫిబ్రవరి 29: కురుగోడు పరిధిలోని రైతన్నలకు పట్టాలు ఇచ్చేవరకు నిరసనలు తప్పవంటూ శివశంకర్ తెలిపారు. నల్లప్ప చెరువులో గత కొన్ని సంవత్సరాలుగా సేద్యం చేస్తూ రైతన్నలు తమ జీవనం గడుపుతున్నారు. ఎన్నోసార్లు పట్టాల విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ఇదిగో అదిగో అంటూ మభ్యపెడుతున్నారు. మల్లప్ప చెరువులో సేద్యం చేసుకున్న రైతులకు పట్టాలు ఇచ్చే వరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు.

డ్రాయింగ్‌లో ప్రణతికి ప్రథమ స్థానం

కంప్లి, ఫిబ్రవరి 29: కంప్లి పట్టణానికి చెందిన సాహితీ విద్యాలయం పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న బివి ప్రణతి బళ్లారి జిల్లాలో శిశు సంక్షేమ కన్నడ మత్తు సాంస్కృతిక శాఖ నిర్వహించినప్రతిభ పోటీలో డ్రాయింగ్‌లో రాణించడమే కాకుండా జిల్లాలో మొదటి స్థానం దక్కించుకొంది. డ్రాయింగ్‌లో ప్రణతి ప్రథమస్థానం దక్కించుకోవడంతో పాఠశాల విద్యార్థులు, సంస్థ వ్యవస్థాపకులు ఆమెను అభినందించి సన్మానించారు.



సిడిబండి ఉత్సవానికి భారీ ఏర్పాట్లు

ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర వెల్లడి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 29: మార్చి 19న శ్రీ కనకదుర్గమ్మ సిడిబండి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు తమ బాధ్యతలను చక్కగా నిర్వహించాలని బళ్లారి ఇన్‌ఛార్జిమంత్రి నాగేంద్ర సూచించారు. అనంతపురం రోడ్డులోని కొత్తజిల్లా పాలనా మందిరంలో గురువారం శ్రీకనకదుర్గమ్మ ఆలయ సిడిబండి మహోత్సవ ఏర్పాట్లపై ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంలోని ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, అందరినీ ఆహ్వానించాలని, రథ చక్రాలను తనిఖీ చేయాలని ఆలయ కార్యనిర్వాహక అధికారులను ఆదేశించారు. ఆలయ పరిశుభ్రత కోసం ఆలయం చుట్టూ జాతర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. రథోత్సవ కార్యక్రమంలో దాదాపు 3నుంచి 4లక్షల మంది చేరే అవకాశం ఉందని, వచ్చే ప్రజలకు, భక్తులకు తాగునీటి వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ , బందోబస్తూ ఏర్పాటు చేయాలన్నారు. వైద్యాధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి ఆరోగ్యపరమైన విషయాల కోసం అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులు క్యూలో వచ్చి అమ్మవారి దర్శనం చేసుకునేలా బారికేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని. అగ్నిప్రమాదాలు జరగకుండా ముందజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖను ఆదేశించారు. సిడిబండి రథోత్సవంలో భాగంగా నగరంలోని ముఖ్యమైన సర్కిళ్లలో లైటింగ్ ఏర్పాటు చేయాలని బళ్లారి సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి అన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీలకు నిర్ణీత సమయం కేటాయించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బంది కలగించకూడదని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర

రేపు మోకా ముదిమల్లేశ్వర ఆలయ జాతర ఉత్సవం

బళ్లారి తాలూకా మోకా గ్రామంలోని ముదిమల్లేశ్వర ఆలయ జాతర మహోత్సవం మార్చి 2న జరగనున్నట్లు అవసరమైన ముందుస్తుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బి.శ్వేత, డిప్యూటీ మేయర్ జానకి, జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, జిల్లాపోలీస్ అధికారి రంజిత్‌కుమార్ బండారు. అసిస్టెంట్ కమిషనర్ హేమంత్, తహసిల్దార్ గురురాజ్, ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప,గనుల సంఘం సభ్యులు ,జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వావలంబనకు విద్య ముఖ్యం

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 29: మనిషి స్వావలంబనతో జీవించాలంటే విద్య ఎంతో అవసరమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అభిప్రాయపడ్డారు. నగరంలోని విమ్స్ ఆసుపత్రి వైద్యభవన్‌లో గురువారం జిల్లాపరిపాలన, జిల్లా పంచాయతీ, కర్ణాటక చైల్డ్ డెవలప్‌మెంట్ అకాడమీ ధార్వాడ్, మహిళా శిశు అభివృద్ధి శాఖ, ప్రభుత్వ విద్యశాఖ, కన్నడ, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు స్వచ్ఛమైన హృదయంతో ఉంటారని, వారికి మంచి భవిష్యత్తును కల్పించేందుకు విద్యను అందించే పనిని తల్లిదండ్రులు చేయాలని సూచించారు. పిల్లలకు డాక్టర్ అంబేద్కర్, అబ్దుల్ కలామ్, స్వామి వివేకానంద, లాల్ బహద్దూర్ శాస్త్రి తదితర మహనీయుల జీవిత విశేషాలను పిల్లలకు చెప్పాలన్నారు. పిల్లలకు మనమంతా ఒకటే అనే భావన కలిగించి సామాజికంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమానికి మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి వేదికలు దోహదపడుతాయన్నారు. సంగీతం, నాటకప్రదర్శన, జానపద నృత్యం, మోడలింగ్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. ఈసందర్భంలో జిల్లాకార్మిక అధికారి కమలషా ఆల్తాప్ అహ్మద్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, మహిళా శిశు అభివృద్ధి శాఖ జిల్లా అధికారి రామకృష్ణ నాయక్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లాఅధికారి జలాలప్ప, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

గంగావతి వద్ద ప్రైవేట్ బస్సు బోల్తా

20మందికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన బస్సు.. రోడ్డుపై పడిపోయిన ప్రయాణికులు

గంగావతి రూరల్, ఫిబ్రవరి 29: గంగావతి పట్టణం హేమగుడ్డ టోల్‌గేట్ సమీపంలో గురువారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు బోల్తాపడిన ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 20మంది తీవ్రంగా గాయపడగా మిగిలిన 20మంది కొద్దిపాటి గాయాలతో బతికి బయట పడ్డారు. హైదరాబాద్ నుండి బెళగావికి వెళుతున్న ఎస్ఆర్ఎస్ బస్సు బుధవారం రాత్రి హైదరాబాద్ నుండి బయలు దేరింది. గంగావతి పట్టణం మీదుగా గురువారం ఉదయం బెళగావికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో భాగంగా బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనా స్థలానికి కొన్ని అడుగుల దూరంలో ఉన్న లోయలో బస్సు బోల్తా పడడంతో ప్రయాణికులు ప్రాణాలతో బతికి బయట పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని గంగావతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మరికొందరిని కొప్పళ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

రాత్రయితే అక్కడ వైద్యులు కనిపించరు

కంప్లి, ఫిబ్రవరి 29 : కంప్లి తాలుకాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే వైద్యులు అందుబాటులో వుంటారు. సాయంత్రం కాగానే ఆస్పత్రి ఎక్కడ చూసినా ఖాళీ. ఒక వేళ డ్యూటీ డాక్టర్ ఉన్నా లేకున్నా అక్కడున్న సిబ్బందిపై బాధ్యత వదిలి సొంతంగా వున్న ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స అందిస్తున్నారు. దీంతో ఎంతో మంది సాయంత్రం వేళల్లో ప్రభుత్వాస్పత్రికి వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. డాక్టర్లకు ప్రభుత్వం ద్వారా వేతనాలు వస్తున్నా సాయంత్రం వేళల్లో వారే ప్రత్యేకంగా ఆస్పత్రులు ఏర్పాటు చేసుకుని నడుపుకుంటున్నారు. కానీ ప్రభుత్వాస్పత్రిలో మాత్రం వైద్యుల కొరత ఏర్పడింది. రోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభు క్యాంపు గ్రామ పంచాయతీ సభ్యులు తిమ్మప్ప మాట్లాడుతూ సాయంత్రం ఎవరైనా చికిత్స కోసం వచ్చినా ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో వుండటం లేదన్నారు. రాత్రి వేళల్లో కూడా రోగులకు డాక్టర్లు అందుబాటులో వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం ప్రభు క్యాంపుకు చెందిన ఒక మహిళను కాన్పు కోసం ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా అక్కడ మత్తు ఇంజెక్షన్ ఇచ్చే వైద్యులు అందుబాటులో లేరని గంగావతికి గానీ, బళ్లారికి గానీ వెళ్లాలని సూచించినట్లు సమాచారం. ఇలా బయటకు రెఫర్ చేసినట్లయితే పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. సాయంత్రం వేళల్లో నర్సు, డీ గ్రూపు సిబ్బంది వైద్యులు ఇచ్చిన సూచనల మేరకు ఇంజెక్షన్లు, సెలైన్‌లు ఎక్కిస్తూ చికిత్స చేస్తున్నారు.

బుడా అధ్యక్షుడిగా జేఎస్ ఆంజనేయులు



బుడా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జేఎస్ ఆంజనేయులు

బళ్లారి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బళ్లారి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(బుడా) అధ్యక్షుడుగా జే.ఎస్.అంజనేయులు గురువారం బాధ్యతలు చేపట్టారు. గురువారం సాయంత్రం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు అయిన అంజనేయులు బుడా అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించడం ఇది రెండో సారి. 2017లో సుమారు రెండేళ్లపాటు ఆయన బుడా అధ్యక్షుడుగా కొనసాగారు. ప్రస్తుతం రెండవ సారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్, సీఎం సిద్దరామయ్య, తనను అధ్యక్షుడిగా నియమించారనితెలిపారు. పార్టీ రుణం తీర్చుకుంటానని తెలిపారు. బళ్లారి అర్బన్ బోర్డు నుండి అభివృద్ధి పనులు చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని కాంగ్రెస్ నాయకులు, బుడా అధికారులు సన్మానించారు.

ఇన్‌చార్జి మంత్రి కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర, మేయర్ శ్వేత తదితరులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 29: షెడ్యూల్డ్ తెగల సంక్షేమ, యువజన సాధికారత క్రీడల శాఖ మంత్రి బి.నాగేంద్ర గురువారం అనంతపురం రోడ్డులోని కొత్త జిల్లా పరిపాలనా భవనంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఆలకించడానికి కార్యాలయం ప్రారంభించినట్లు చెప్పారు. ఈసందర్భంగా బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బి.శ్వేత, డిప్యూటీ మేయర్ బి.జానకి,జిల్లాపోలీసు సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు. జిల్లాపంచాయితీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి రాహుల్ శరణప్ప సంకనూర్, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్ ,డీఎంఎఫ్ ప్రత్యేకాధికారి మంజునాథ్, తహసీల్దార్ గురురాజ్‌తోపాటు కార్పొరేషన్ సభ్యులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 29: విద్యార్థులు శారీరకంగా, దృఢంగా ఉండేందుకు పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్ళగుర్కి అన్నారు. గురువారం సిడిగినమోల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి తాలూకా సంజీవరాయనకోటె ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పాలు, పండ్లు, కోడిగుడ్లు, మాంసం, చేపలు తినాలని ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి చూపు లోపం ఉన్న పాఠశాల విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేశారు. రవిచెళ్లగుర్కి మాట్లాడుతూ కూరగాయలు,పువ్వులు, కార్బోహైడ్రేట్లు క్రమం తప్పకుండా ప్రతి రోజు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా శక్తిని పెంచుకోవాలని అన్నారు. విద్యార్థులు సునీల్, స్వామి, గీత, గాయత్రి, ప్రియాంకలకు అద్దాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సిడిగినమోల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ కంటి వైద్యనిపుణులు విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బసవ రాజు, సుమతి, ఉమ్మెహాని, రామాంజినేయ తదితరులు పాల్గొన్నారు.

కుడితినిలో తీవ్రరూపందాల్చిన నీటి సమస్య

కంప్లి, ఫిబ్రవరి 29 : కుడితిని పట్టణంలో నీటి సమస్య వుండటంతో అల్లిపీర, తోరణగల్లు నుంచి వచ్చిన ట్యాంకర వద్ద దాదాపు బిందెరూ. పదిలతో కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



నీటిని కొనుగోలు చేస్తున్న మహిళలు

హొసూరు జోన్

విద్యార్థులకు అభినందన



కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు

హొసూరు ఫిబ్రవరి 29 : హొసూరు యూనియన్ బేడరపల్లిలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో 8వ తరగతికి చెందిన 66 మంది విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ గ్రాంట్ కోసం పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి విడుదలయ్యాయి. ఈ పాఠశాలలో హాజరైన 66 మంది విద్యార్థులలో ధరణీధరన్, సూరజ్‌కుమార్ సానియా, వంశిక, సమీక్ష, నిషా, సాధన, శబరి, ధనుశ్వరన్, వసంత్ కృష్ణన్ అనే 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పౌన్‌నాగేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ జరిగింది, ఈ సందర్భంగా హొసూరు విద్యాశాఖ జిల్లా ప్రాథమిక విద్యాధికారి మునిరాజ్ మునానిల్ విద్యార్థులను ప్రోత్సాహించి విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో హొసూరు ప్రాంతీయ విద్యాశాఖాధికారులు సతీష్, అన్నయ్య, ఉపాధ్యాయ శిక్షకురాలు గాయత్రి, హొసూరు కార్పొరేషన్ విద్యాకమిటీ చైర్మెన్ శ్రీధర్ విద్యార్థులను అభినందించారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు కమిటీ అధ్యక్షుడు లకప్ప, సుందరమూర్తి, ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లితండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు హాజరైయ్యారు. ఈ పది మంది విద్యార్థులకు వరుసగా నాలుగు సంవత్సరాలపాటు నెలకు రూ.1000 చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది.

పెరియముత్తాళీ గ్రామంలో ఎద్దుల పండుగ

హొసూరు(మత్తిగిరి) ఫిబ్రవరి 29 : హొసూరు సమీపంల్లోని పెరియముత్తాళీ గ్రామంలో గురువారం సంప్రదాయబద్ధంగా ఎద్దుల పండుగ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో శూలగిరి, హొసూరు, బాగలూరు, బేరికై, రాయకోట, తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వందలాది ఎద్దులను రంగుల వాడివాసన్ నుంచి ఒక్కొక్కటిగా విప్పారు. ఎద్దుల పండుగల్లో విరుచుకుపడుతున్న ఎద్దులను లొంగతీసుకునేందుకు యువకులు పోటీపడి ఎద్దుల కొమ్ములను గట్టిగా పట్టుకుని వాటిని లొంగతీసే ప్రయత్నం చేశారు. కొన్ని ఎద్దులు బోల్తా పడి 10 మందికి పైగా స్వల్ప గాయాల పాలయ్యారు. ఈ సంప్రదాయకబద్ధంగా జరిగే ఎద్దుల పండుగ వీక్షించేందుకు చుట్టుముట్టు ప్రాంతాల వాసులు వేలాదిమంది పాల్గొన్నారు. ఈ వేడుకలో ప్రజలు ఎక్కువ సంఖ్యల్లో పాల్గొని వీక్షించారు.

డిమాండ్ల సాధన కోసం నిర్మాణ కార్మికుల ప్రదర్శన

హొసూరు(సిప్‌కాట్) ఫిబ్రవరి 29: ఏఐటీయూసీ ఆధ్వర్యంల్లో హొసూరు గాంధీ విగ్రహం దగ్గర భవన నిర్మాణ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు భవన నిర్మాణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చాన్‌భాషా నాయకత్వం వహించారు. హొసూరు నగర కార్యదర్శి శివరాజ్, జిల్లా కోశాధికారి అరవింద్ కృష్ణప్ప, బాగలూరు కృష్ణప్ప, నాగరాజ్, ఎల్లప్ప, ముంతాజ్ నాయకత్వం వహించారు. ఈ నిరసన ప్రదర్శనల్లో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగుమయ్య ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదయ్య, సీపీఐ నగర కార్యదర్శి శంకరయ్య పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, సంక్షేమ బోర్డు, యూఎన్ వర్ల్డ్ లేబర్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాల ప్రకారం నిర్మాణ కార్మికులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని, మెడికల్ ఈఎస్ఐ బీమా, సంక్షేమ బోర్డు ద్వారా పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.



భవన కార్మికుల తరపున నిరసన తెలుపుతున్న దృశ్యం

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

● విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ థావర్‌చంద్ గెహ్లోట్ హితవు



స్నాతకోత్సవానికి వస్తున్న గవర్నర్ డాక్టర్ థావర్‌చంద్ గెహ్లోట్

రాయచూరు, ఫిబ్రవరి 29 : ప్రపంచంలో 5వ ఆర్థిక శక్తివంత దేశంగా ఉన్న భారత్ స్థానాన్ని మరింత పెంచేందుకు విద్యార్థులు తమవంతు కృషి సాగించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ థావర్‌చంద్‌గెహ్లోట్ సూచించారు. రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం 13వ స్నాతకోత్సవాన్ని గవర్నర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశ ఆర్థిక పురోగతిలో వ్యవసాయ రంగం అత్యంత కీలకమైందన్నారు. వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతి వల్లే దేశం 5వ ఆర్థిక శక్తివంతమైన దేశంగా ఎదిగిందని ఆ స్థానాన్ని మరింత పెంచేందుకు విద్యార్థులు తమ పరిశోధనల ద్వార తోడ్పాటునందించాలన్నారు. దాంతో పాటే పర్యావరణానికి జరుగుతున్న హాని వల్ల వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యను ప్రజలకు వివరించేందుకు విద్యావంతులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఇందుకోసం విద్యార్థులు వ్యవసాయ రంగంలో ఆధునీకరణను సాధించే దిశగా పరిశోధనలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.


నూతన వంగడాలపై పరిశోధన అభినందనీయం

రాయచూరు, ఫిబ్రవరి 29: నూతన వంగడాల అభివృద్ధి, దిగుబడుల పెంపు తదితర అంశాలపై రాయచూరు విశ్వవిద్యాలయంలో సాగుతున్న పరిశోధనలు అభినందనీయమని డిల్లీకి చెందిన వ్యవసాయ అనుసంధాన పరిషత్ డైరెక్టర్ డా.ఎన్.ఎస్.ఝా అన్నారు. రాయచూరు విశ్వ విద్యాలయం 13వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన వంగడాల గురించి ప్రత్యేక ఉపన్యాసం చేశారు. రాయచూరు విశ్వ విద్యాలయంలో గడచిన కొన్నేళ్లుగా సాగుతున్న పరిశోధనలు అద్భుత ఫలితాలనిచ్చాయని ప్రశంసించారు. వరి ధాన్యంతోపాటు కల్యాణ-కర్ణాటకలో ప్రధాన వాణిజ్య పంటగా పండిస్తున్న పత్తి పై మరిన్ని పరిశోధనలు సాగాల్సి ఉందన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంచ్...

ఎంకే త్యాగరాజ భాగవతార్ (జయంతి)




తమిళ సినిమారంగంలో తొలి సూపర్‌స్టార్‌గా పేరొందిన మాయవరం కృష్ణమూర్తి (ఎంకే) త్యాగరాజ భాగవతార్ 1910 మార్చి 1న తంజావూరు జిల్లా మాయవరం ప్రాంతంలో జన్మించారు. నటుడు, నిర్మాతగానే కాకుండా కర్ణాటక సంగీత గాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రత్యేకించి భక్తిగీతాలను స్వర పరచడంలోనూ నిష్ణాతులు. 1944లో విడుదలైన 'హరిదాస్' సినిమా మద్రాస్ బ్రాడ్‌వే థియేటర్‌లో వరుసగా మూడేళ్లపాటు ప్రదర్శించబడి రికార్డుకెక్కింది. రెండో ప్రపంచయుద్ధ సమయాన అప్పటి బ్రిటీష్ గవర్నర్ కోరిక మేరకు పలు కచేరీలు నిర్వహించారు. 1959 నవంబరు 1న కన్నుమూశారు.

ఆర్‌పీ గోయెంకా (జయంతి)



రామ ప్రసాద్ గోయెంకా 1930 మార్చి 1న కోల్కత్తాలో జన్మించారు. ఆర్‌పీజీ గ్రూప్ సంస్థ సంస్థాపకులు, ఛైర్మన్. ఇంటర్నేషనల్ మేనేజిమెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్టుకు సభ్యుడిగా, ఫిక్కీ అధ్యక్షుడిగా, ఐఐటీ ఖరగ్‌పూర్‌కు ఛైర్మన్‌గా, టీటీడీ సభ్యుడిగా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. ఎంపెరర్ ఆఫ్ జపాన్ నుంచి ఆర్డర్ ఆఫ్ ది సాక్రెడ్ ట్రెజర్ పురస్కారాన్ని రెండుసార్లు అందుకున్నారు. 2013 ఏప్రిల్ 14న కన్నుమూశారు.

ఎంకే స్టాలిన్ (పుట్టినరోజు)



డీఎంకే పార్టీ అధ్యక్షుడు, తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ముత్తువేల్ కరుణానిధి (ఎంకే) స్టాలిన్ 1953 మార్చి 1న మద్రాస్‌లో జన్మించారు. తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి కుమారుడు. 2009-11 మధ్య తమిళనాడు ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 2021లో పెరియార్ జయంతిని సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించారు. డీఎంకే యువవిభాగం ఏర్పాటు చేసి సుదీర్ఘ కాలం సెక్రటరీగా కొనసాగారు. 1996లో చెన్నై మేయర్‌గా ఎన్నికయ్యారు. చెన్నైని 9 ఫ్లైవర్‌లతో అభివృద్ధి చేశారు. 2022లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ పర్సనాలిటీలలో 24వ స్థానంలో నిలిచారు.

నితీష్ కుమార్ (పుట్టినరోజు)



బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం కొనసాగిన నితీష్ కుమార్ 1951 మార్చి 1న బీహార్ రాష్ట్రం బక్తియార్‌పూర్‌లో జన్మించారు. కేంద్రంలో రైల్వే, రవాణా, వ్యవసాయం తదితరశాఖలను పర్యవేక్షించిన ఘనత ఉంది. ప్రధానంగా రైల్వేలో తత్కాల్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. జనతాదళ్ (యునైటెడ్) పార్టీలో కీలక నేత. ముఖ్యమంత్రిగా లక్షమంది ఉపాధ్యాయులను నియమించారు. బాలికా విద్యను ప్రోత్సహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులను నియమించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేశారు. మద్యపాన నిషేధం విధించి గుర్తింపు పొందారు. నిరక్షరాస్యతను తగ్గించడం ద్వారా నేరాల సంఖ్య కూడా తగ్గేలా చేశా రు. బీహార్ రాష్ట్ర సగటు ఆదాయం పెంచేలా ఎంతో కృషి చేశారు. పలు గౌరవాలు అందుకున్నారు.

డెనిస్ ముక్వేగి (పుట్టినరోజు)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీతలలో ఒకరైన డెనిస్ ముక్వేగి 1955 మార్చి 1న జన్మించారు. కాంగో దేశంలో పేరొందిన గైనకాలజిస్ట్, పెంతెకోస్తు పాస్టర్. బుకావులో పాన్జీ హాస్పిటల్ స్థాపించి సాయుధ విప్లవకారుల దాడికి గురైన మహిళలకు చికిత్సలు అందిస్తున్నారు. రెండో కాంగో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అత్యాచార బాధితులైన వేలాదిమంది మహిళలకు చికిత్స అందించారు. ముక్వేగి, నదియా మురాద్‌లకు నోబెల్ శాంతి బహుమతిని సంయుక్తంగా ప్రదానం చేశారు. చాంపియన్ పీస్ అవార్డ్, సియోల్ పీస్ ప్రైజ్, యూఎన్ హ్యూమన్ రైట్స్ ప్రైజ్, తదితర పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు.

షాహిద్ అఫ్రిది (పుట్టినరోజు)



పాకిస్థాన్‌కు చెందిన క్రికెటర్ సాహిబ్జాదా మొహమ్మద్ షాహిద్ ఖాన్ అఫ్రిది 1975 మార్చి 1న జన్మించారు. పాకిస్థానీ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆల్‌రౌండర్ ప్రతిభ కలిగినవారు. ఫాస్టెస్ట్ వన్డే సెంచరీలోనూ, వన్డేలలో అత్యధిక సిక్స్‌లు కొట్టి తనదైన రికార్డు నెలకొల్పారు. సొంతంగా ఫౌండేషన్ ఏర్పాటు చేసి విద్య, ఆరోగ్యంకోసం కృషి చేస్తున్నారు. యునిసెఫ్‌తోపాటు పలు స్వచ్ఛంద సంస్థలతో కలసి పోలియో నివారణ కోసం రాయబారిగా వ్యవహరించారు.

మేరీ కోమ్ (పుట్టినరోజు)



'పద్మ విభూషణ్' గ్రహీత, బాక్సింగ్ క్రీడాకారిణి మాంగ్టే చుంగ్నేజియంగ్ మేరీ కోమ్ 1983 మార్చి 1న మణిపూర్ రాష్ట్రం కంగథాయ్ ప్రాంతంలో జన్మించారు. అమెచ్యూర్ బాక్సర్, రాజ్యసభ సభ్యురాలిగా వ్యవహరించారు. వరల్డ్ అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌గా ఆరుసార్లు విజేతగా నిలిచిన మహిళగా తనదైన గుర్తింపు పొందారు. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో 51 కి లోల విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించారు. ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్‌చే వరల్డ్ నెంబరు 1గా నిలిచారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు, ఇతరత్రా అవార్డులు పొందారు.

రెండు వారాల గడువు పెంపు

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్తక వాణిజ్య సంస్థలు తమ నేమ్ బోర్డులలో 60 శాతం మేరకు తప్పనిసరిగా కన్నడ భాషను వినియోగించాల్సి ఉంటుంది. ఇందుకుగాను విధించిన గడువు బుధవారంతో పూర్తికావడంతో తాజా మరో రెండు నెలల పాటు దీన్ని పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి డికె. శివకుమార్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కర్ణాటకలో కన్నడ భాషే సార్వభౌమాధికారం కలిగి ఉంటుందన్నారు. కన్నడ భాషను రాష్ట్రంలో ఉంటున్న అందరూ గౌరవించాలన్నారు. గడువు పెంపు అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైసూరు రాజకుటుంబానికి లోక్‌సభ టిక్కెట్ ?

● పార్టీలోకి ఆహ్వానించేందుకు బీజేపీ నేతల యత్నాలు

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మైసూరు యువరాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ ఒడియార్‌కు మైసూరు బీజేపీ ఎంపీ అభ్యర్థిని చేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం మైసూరు ఎంపీగా ప్రతాప్‌సింహ వ్యవహరిస్తున్నారు. పాత్రికేయుడిగా కొనసాగుతున్న ప్రతాప్‌సింహ రెండుసార్లు ఎంపీగా గెలుపు సాధించారు. ఇప్పటివరకూ ప్రతాప్‌సింహకే టికెట్ దక్కనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ మైసూరు రాజ కుటుంబీకులను బీజేపీలోకి చేర్చుకోవాలనే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. మైసూరు రాజ కుటుంబానికి రాజకీయాలు కొత్తవేమి కాదు. శ్రీకంఠదత్త నరసింహరాజ ఒడియార్ 1984, 1989, 1996, 1999లలో మైసూరు ఎంపీగా గెలుపొందుతూ వచ్చారు. 1991,2004లో రెండుసార్లు ఓటమి చెందారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్నా మైసూరు సంస్థానంకు రాజుగా కొనసాగుతూ వచ్చారు. 2013లో శ్రీకంఠదత్త చామరాజ ఒడియార్ అనారోగ్యంతో కన్నుమూశారు. శ్రీకంఠదత్త చామరాజ అక్కమనవడు యదువీర్ 2015 యువరాజుగా బాధ్యతలు చేపట్టారు. యదువీర్‌ను రాజకీయాలలోకి తీసుకువచ్చేందుకు సుదీర్ఘకాలంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏడాదిన్నర కిందట మైసూరును సందర్శించిన వేళ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా రాజకుటుంబంతో చర్చలు జరిపారు. అప్పట్లో యదువీర్ రాజకీయాలలోకి వచ్చేందుకు ఉత్సాహం చూపలేదు. దీంతో అందుకు సంబంధించిన చర్చలు జరుగలేదు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ మరోసారి యదువీర్‌ను రాజకీయాలలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. యదువీర్ భార్య త్రిషికా కుమారి రాజస్థాన్‌కు చెందిన రాజకుటుంబానికి చెందినవారు. రాజస్థాన్‌లో త్రిషి కా బంధువులు బీజేపీతో సంబంధాలు కలిగి ఉన్నారు. ఆవిధంగా కూడా ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ యదువీర్ రాజకీయాలకు వచ్చేందుకు ససేమిరా అంటే రాజమాత ప్రమోదాదేవి ఒడియర్‌ను ఒప్పించి పోటీ చేయించే ఆలోచన కూడా ఉన్నట్లు సమాచారం.



రాజమాత ప్రమోదాదేవితో యువరాజు యదువీర్

ఐదు గ్యారెంటీ పథకాల అమలు పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలైన అన్నభాగ్య, శక్తి, గృహజ్యోతి, గృహలక్ష్మి, యువనిధిల పర్యవేక్షణకోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ అధ్యక్షుడిగా ఉంటారు. ఆయనకు కేబినెట్ హోదా ఉంటుందని నగరంలో గురువారం విడుదలైన ప్రకటన పేర్కొంది. కమిటీ ఉపాధ్యక్షులుగా మెహరూజ్ ఖాన్, పుష్పఅమర్‌నాథ్, ఎస్ఆర్.పాటిల్, సూరజ్ హెగ్డే వ్యవహరిస్తారని ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ ప్రతినెలా సమావేశమై గ్యారంటీ పథకాల అమలును సమీక్షిస్తుంటుంది. అర్హులైన లబ్దిదారులందరికీ పథకాలు అందే లా చూస్తుంది.

డాక్టర్ బనర్జీకి ఆర్థోస్కోపిక్ విభాగంలో పేటెంట్




బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు బనర్జీ బీహెచ్‌కు ఆర్థోస్కోపిక్ కార్పల్ టనల్ పరికరం రూపకల్పన సాధించినందుకు పేటెంట్ దక్కింది. డాక్టర్ బనర్జీ తెలిపిన మేరకు ఈ పరికరంతో ఎముకల ఆపరేషన్‌ల ప్రగతిని తెలుసుకునేందుకు వీలుందన్నారు. కార్పల్ టనెల్ సిం డ్రోం(సీటీఎస్) చికిత్స పురోగతి సాధ్యమన్నారు. సంప్రదాయిక ఓపెన్ ఆపరేషన్‌లకు పర్యాయంగా రోగికి అతి తక్కువ హానికరం చేయనుందన్నారు. సీటీఎస్ అనేది ఫోకల్ మోనో న్యూరోపతికి సంబంధించిన విధమన్నారు. టన్నెల్‌లోని మధ్యస్థ నాడీ కుదింపు, తిమ్మిరి, జలదరింపు, బొటనవేలితో పాటు ఇతర వేళ్ళ బలహీనత వంటి సమస్యల బాధితులకు సులభతరంగా చికిత్సలు అందించవచ్చు అన్నారు. మణికట్టు లేదా కీళ్ళనొప్పులు కలిగిన వారికి మధ్యస్థ నరాల మీద ఒత్తిడిని పెంచుతుందన్నారు. సుదీర్ఘ కాలం పరిశోధనలు చేసి డిజైన్‌ను రూపొందించామన్నారు. కొత్తపరికరం ద్వారా అరచేతిని పెద్దకోత లేకుండానే ఆపరేషన్ చేయవచ్చు అన్నారు. మణికట్టులో తిమ్మిరి, నొప్పి చికిత్సలకు పరికరం ప్రయోజనకరమన్నారు. ఆపరేషన్ తర్వాత వేగవంతంగా రికవరీ అయ్యేందుకు వీలుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుం చి పేటెంట్ సర్టిఫికెట్ దక్కిందన్నారు.

సినీనటుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి కె.శివరాం మృతి

● కన్నడ భాషలో పరీక్షలు రాసిన తొలి ఐఏఎస్ అధికారి

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషలో పరీక్ష రాసి ఐఏఎస్‌లో ఉత్తీర్ణుడైన కె.శివరాం (70) గురువారం గుండెపోటుకు గురై మృతి చెందారు. ఐఏఎస్ అధికారిగా పాలనా వ్యవహారాల్లో రాణిస్తూనే సినీనటుడిగానూ ఆయన ఖ్యాతి గడించారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఆయన బీజేపిలో చేరారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పార్టీలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని బీజాపూర్ నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. కాగా కొద్దికాలంగా కేన్సర్‌తో ఇబ్బంది పడుతున్న ఆయన నగరంలోని హెచ్‌సీజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఛాతీలో నొప్పి గా ఉండటంతో రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరి చికిత్స పొం దుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి గురువారం ఒక్కసారిగా విషమించింది. వైద్యులు చికిత్స చేసినా ఫలితం కనిపించలేదు. చికిత్స పొందుతూనే ఆయన తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఐఏఎస్ అధికారిగా కె.శివరాం బెంగళూరు, మైసూరు, బీజాపూర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఆయనకు మంచి పేరువచ్చింది. 2013లో రిటైర్ అయ్యేంతవరకు ఆయన ఎంఎస్ఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించారు. నటుడిగా బా నల్లె మదుచంద్రక్కెతో శివరాం కన్నడ సినిమాలో ఆరంగేట్రం చేశారు. ఆపై పలు హిట్ సినిమాల్లో నటించారు. శివరాం మృతి పట్ల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్, మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, బసవరాజ బొమ్మై. డీవీ సదానందగౌడ, హెచ్‌డి.కుమారస్వామి ప్రతిపక్ష నేత ఆర్. అశోక్. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బివై విజయేంద్ర తదితరులు ప్రగాఢసంతాపం ప్రకటించారు.



కె.శివరాం(ఫైల్)

44 మందికి.. బోర్డులు, కార్పొరేషన్ పదవులు

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు ముందుగా ప్రకటించిన విధంగానే బోర్డులు, కార్పొరేషన్ హోదాలు కల్పించారు. 44 మంది జాబితాను సీఎం సిద్దరామయ్య గురువారం విడుదల చేశారు.

బోర్డు, కార్పొరేషన్	ఛైర్మన్
నైపుణ్యాభివృద్ధి కమిటీ	కాంతానాయ్క
బాబు జగజ్జీవనరావ్ చర్మ అభివృద్ధి	ముండరగి నాగరాజు
క్రీడా ప్రాధికార	వినోద్ కె అసోటి
సాగుఉత్పత్తుల సంస్కరణ, ఎగుమతులు	బీహెచ్ హరీష్
భద్రా కాడా శివమొగ్గ	అంశుమంత్
బళ్ళారి నగరాభివృద్ధి ప్రాధికార	జెఎస్ ఆంజనేయులు
కర్ణాటక వైన్ బోర్డ్	డాక్టర్ బి యోగీష్‌బాబు
కంది అభివృద్ధి మండలి	మరిగౌడ యాదగిరి
గొర్రెలు, ఉన్ని అభివృద్ధి మండలి	దేవేంద్రప్ప మర్యూరు
సంప్రదాయ ఇంధనవనరులు	రాజశేఖర్ రామస్వరం
మైసూరు నగరాభివృద్ధి	కె.మరిగౌడ
మైసూరు ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్	ఎస్. మనోహర్
మైసూరు పెయింట్స్ వార్నిష్	అయూబ్‌ఖాన్
జీడిపప్పు అభివృద్ధి మండలి	మమతాగట్టి
సాంబారు పదార్థాల అభివృద్ధి మండలి	పల్లవి జి
కొబ్బరి అభివృద్ధి మండలి	హెచ్‌సి సుదీంద్ర
మహిళా కమీషన్	డాక్టర్ నాగలక్ష్మీచౌదరి
శివమొగ్గ నగరాభివృద్ధి మండలి	హెచ్ఎస్ సుందరేష్
మలెనాడు అభివృద్ధి	ఆర్ఎం మంజునాథ్‌గౌడ
షెడ్యూలు కులాలు, తెగలుఅభివృద్ధి మండలి	జయణ్ణ
అంబేద్కర్ అభివృద్ధి మండలి	ఆర్. సంపత్‌రాజ్
మహిళాభివృద్ధి కార్పొరేషన్	పద్మావతి
పర్యాటక అభివృద్ధి మండలి	మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్
హుబ్బళ్ళి- ధారవాడ నగరాభివృద్ధి	షాకీర్ సనది
సరిహద్దు అభివృద్ధి ప్రాధికార	సోమణ్ణ బేవనమరడ
కంఠీరవా స్టుడియో	గణేష్
దేవరాజు అరసు ట్రక్ టర్మినల్	మజర్‌ఖాన్
సఫాయి కర్మచారి కమీషన్	వితారము
విద్యుత్ కార్పొరేషన్	లలిత్‌రాఘవ్
కార్మిక సంక్షేమ సంఘం	జిఎస్ మంజునాథ్
మత్స్య అభివృద్ధి మండలి	మాలా నారాయణరావ్
మామిడి అభివృద్ధి, మార్కెటింగ్	రిజ్వాన్, జయనగర్
చిక్కబళ్ళాపుర నగరాభివృద్ధి	కేశవరెడ్డి
చిత్రదుర్గ నగరాభివృద్ధి	తాజ్‌పీర్
మైసూరు షుగర్స్	గంగాధర్
మైనారిటీ అభివృద్ధి మండలి	అల్తాఫ్
బ్రాహ్మణ అభివృద్ధి మండలి	జయసింహ
సబ్‌అర్బన్ రింగ్‌రోడ్ కార్పొరేషన్	విజయ్ కె ముతగుండ్
కాడా మైసూరు	మరిస్వామి చామరాజనగర్
మంగళూరు నగరాభివృద్ధి	సదాశివ ఉల్లాళ్
బెంగళూరు-మైసూరు ఇన్‌ఫ్రా	రఘునందన్‌రామణ్ణ
బీదర్ నగరాభివృద్ధి	బసవరాజ్ జాబశెట్టి
చలనచిత్ర అకాడమి	సాధుకోకిల

గవర్నర్ పరిశీలనకు మేఘమథనం ప్రైవేట్ బిల్లు

● శాసనసభ తీర్మానం ● తీవ్ర కరువులోనూ సాంకేతికతను వినియోగించుకోలేమా? ● మంత్రి హెచ్‌కే పాటిల్ తీవ్ర అసంతృప్తి

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మేఘమథనం బిల్లును గవర్నర్ పరిశీలనకు పంపించాలని శాసనసభ తీర్మానించింది. శాసనసభలో గురువార ం రాణిబెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రకాష్ కోళివాడ కర్ణాటక మేఘమథనం బిల్లు 2024ను ప్రవేశపెట్టారు. కరువు తీవ్రతను తగ్గించడం, భూగర్భజలాల ప్రమాణాన్ని పెంచుకోవడం, రిజర్వాయర్లలో నీటి ఇన్‌ఫ్లోను పెంచుకోవడం, నీటి పారుదల భూములను మరింతగా విస్తరించుకోవడం, విద్యుత్ ఉత్పాదనను మెరుగుపర్చుకోవడం వంటి వాటికోసం మేఘమథనం చాలా అవసరమని ఈ బిల్లులో పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితి కారణంగా రాష్ట్రంలో తీవ్ర కరువు ఏర్పడి ఇప్పటికే రూ 35వేల కోట్ల మేరకు పంటనష్టం సంభవించిందని పేర్కొన్నారు. ఒక వేళ మేఘమథనం నిర్వహిస్తే జలాలను 21 శాతం నుంచి 46 శాతానికి పెంచుకోవచ్చన్నారు. పంటనష్టాన్ని కనీసం 7వేల కోట్లకు తగ్గించుకునే వెసలుబాటు లభిస్తుందని గణాంక వివరాలతో సహా ఈ బిల్లులో ప్రతిపాదించారు. రాష్ట్రంలో ప్రతియేటా 6వేల నుండి 7వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత 27 సంవత్సరాల అవధిలో 16 సార్లు తీవ్ర కరువుపరిస్థితి ఏర్పడిందన్నారు. 1.10 కోట్ల హెక్టార్లలో పంట నష్టం సంభవించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభలో జరిగిన చర్చలో జోక్యం చేసుకున్న న్యాయ శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి హెచ్‌కె.పాటిల్ తీవ్ర కరువు నేపథ్యంలో మేఘమథనం విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమంటూ బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను మనం రైతులకు అందించలేమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే టీబీ జయచంద్ర మాట్లాడుతూ మేఘమథనం ప్రాజెక్టును అత్యంత పక్కాగా నిర్వహించాల్సి ఉంటుందని అసవరమైతే కరువుతో ఇబ్బంది పడుతున్న చుట్టుపక్కల రాష్ట్రాలు కలసికట్టుగా ఈ ప్రాజెక్టుల పాలుపంచుకునేలా కేంద్రం చొరవ తీసుకోవాలని సూచించారు. గతంలో ఎస్ఎం.కృష్ణ సీఎంగా ఉన్న సమయంలో మేఘమథనాన్ని విజయవంతంగా ని ర్వహించిన సంగతిని మంత్రి హెచ్‌కె.పాటిల్ సభకు గుర్తుచేశారు. మేఘమథనంపై ఉన్న అపోహలను దూరం చేసుకోవాలని సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించుకోవాలని సూచించారు. కరువు సాయం కోసం వందల కోట్లు ఖర్చుపెట్టేకంటే మేఘమథనం కోసం నిర్దిష్టమొత్తాన్ని ఖర్చుపెట్టలేమా అని పలువురు స భ్యులు సభలో అభిప్రాయపడ్డారు. మేఘమథనం జరిపితే 10 నుండి 12 కిలోమీటర్ల పరిధిలో వర్షం తప్పకుండా పడుతుందని నిపుణులు పేర్కొంటున్న సంగతిని గుర్తుచేశారు. మంత్రి పాటిల్ చివరిగా బిల్లుపై స్పందిస్తూ ప్రయివేటు బిల్లును ప్రభుత్వం నేరుగా అంగీకరించడం కుదరదని జాయింట్ కమిటీకి గానీ సెలెక్ట్ కమిటీకిగానీ నివేదించాలని స్పీకర్ స్థానంలో ఉన్న డిప్యూ టీ స్పీకర్ రుద్రప్ప లమాణి ప్రభుత్వానికి సూచించారు. సభ్యుల సూచన మేరకు ఈ ప్రైవేట్ బిల్లును గవర్నర్ పరిశీలనకు పంపించాలని సభ తీర్మానించింది.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి కర్తవ్యం : ఎమ్మెల్యే

బెంగళూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): భారత రత్న డా.బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పదిలంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని విజయనగర ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ జాగృతి జాథాకు గురువారం విజయనగర్‌లో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఒక వేళ రాజ్యాంగం లేకపోతే దీనదళితులకు దేశంలో రక్షణ లేకుండా పోయేదన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు దేశంలో పౌరులందరికీ సమానమని ఇది అంబేద్కర్ దూరదృష్టికి నిదర్శమని ఆయన చెప్పారు. స్థానిక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఈ జాథాలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్ప

కాషాయం కండువాలను అడ్డుకున్న పోలీసులు

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): కాషాయం కండువాలను విధానసౌధలోకి తీసుకెళ్ళేందుకు బీజేపీ ఎమ్మెల్సీ కేశవప్రసాద్ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గురువారం ఉదయం వికాససౌధ గాంధీ విగ్రహం గేట్ నుంచి ఎమ్మెల్సీ వ్యక్తిగత సహాయకుల ద్వారా కాషాయం కండువాలతో విధానసౌధలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. అంతలోనే పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు ఎమ్మెల్సీ కేశవప్రసాద్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మహిళా అధికారి కాషాయంతో పాటు ఎటువంటి జెండాలు, కండువాలు విధానసౌధలోకి తీసుకెళ్ళేందుకు వీలులేదని అభ్యంతరం తెలిపారు. ఎక్కడ నిబంధనలు ఉన్నా యో చూపాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. మరో ఇద్దరు ఉన్నతాధికారుల అక్కడికి చేరుకుని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. అంతలోనే సభలోకి సీనియర్ ఎమ్మెల్సీ రఘునాథ్‌రావ్ మల్కాపుర వచ్చారు. చట్టాలు చేసేది మేమేనని ఎక్కడైనా నిబంధనలు ఉంటే చూపాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వదిలిపెట్టారు. దీంతో సుమారు 20నిమిషాల వివాదాలకు చెక్‌పెట్టినట్లు అయ్యింది.



సభ్యులను అడ్డుకుంటున్న పోలీసు అధికారి

కులగణన నివేదిక స్వీకరించిన సీఎం

● రెండు బస్తాల్లో అందజేసిన బీసీ కమిషన్ ఛైర్మన్

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన సర్వే జరిగి 9 ఏళ్ళు అవుతున్నా పలు కారణాలతో ప్రభుత్వం స్వీకరించేందుకు వాయిదాలు పడుతూ ఉండేవి. అందుకు పలు సామాజిక వర్గాలు వ్యతిరేకించడం కూడా ప్రధానమైనదిగా ఉం డేది. గురువారం బీసీ కమిషన్ ఛైర్మన్ జయప్రకాష్‌హెగ్డే నుంచి సీఎం సిద్దరామయ్య కులగణన నివేదికను స్వీకరించారు. రెండు భారీ బస్తాల ద్వారా తీసుకువచ్చిన నివేదికను సీఎంకు అప్పగించారు. బీసీ కమిషన్ సమర్పించిన నివేదికలో 13 భాగాలుగా విభజించారు. అవి భారీ పుస్తకాల రూపంలో తయారయ్యాయి. కొన్ని భాగాలను రెండు మూడు సబ్‌డివిజన్‌లుగా విభజించారు. నివేదికలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గీయుల విద్య, సామాజిక హోదాలకు సంబంధించి సమగ్ర వివరాలు పొందుపరచారు. సామాజిక, విద్యకు సంబంధించి 2015 సమగ్ర నివేదిక. కులాల వారీగా జనాభా వివరాలు, కులాలు ఎస్సీ, ఎస్టీలను మినహాయించి వివరాలు, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి జనాభా గణాంకాలు, శాసనసభ నియోజకవర్గాల గణాంకాలు వివరాలు పొందుపరిచారు. 2013-18 సిద్దరామయ్య ప్రభుత్వంలో కులగణన నివేదిక తయారీ కసరత్తు సాగింది. ఇందుకుగాను రూ.154 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. సొంతపార్టీ కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీజేపీ నాయకుల నుంచి పలుమార్లు నివేదికను ప్రభుత్వం స్వీకరించరాదని అభ్యంతరాలు తలెత్తాయి. సమాజంలో కులగణన ద్వారా విభజించే విధానం ఏర్పడుతుందని, ప్రాంతీయ విభేధాలు వస్తాయని విమర్శలు తలెత్తాయి. వీరశైవ లింగాయత వర్గాలకు చెందిన స్వామీజీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇటువంటి అభ్యంతరాల మధ్యన కూడా సీఎం సిద్దరామయ్య కులగణన నివేదిక 2015ను స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందనేది కీలకమవుతోంది. కాగా నివేదిక స్వీకరించాక సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ కులగణన నివేదికను స్వీకరించామన్నారు. నివేదికలో ఏముందనేది కేబినెట్ ముందు ఉంచి పరిశీలిస్తామన్నారు. కాంతరాజు నివేదికను కలుపుకుని బీసీ కమిషన్ ఛైర్మన్ జయప్రకాష్‌హెగ్డే సిద్ధం చేశారన్నారు. నివేదికను సమగ్రంగా పరిశీలిస్తామన్నారు.



నివేదిక పత్రాల సంచులను సీఎంకు అందజేస్తున్న అధికారులు

కాంగ్రెస్ ఆఫర్‌తోనే.... క్రాస్ ఓటింగ్..

● ఉత్తరలోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి ఎస్‌టీ సోమశేఖర్

● కుమారుడికీ ఎమ్మెల్యే టిక్కెట్

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యేగానే ఉంటూనే ఎస్‌టీ సోమశేఖర్ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ల నుంచి బంపర్ ఆఫర్ దక్కడంతోనే ఆయన దీనికి సై అన్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి వేటు వేయక ముందే హస్తంలో చేరేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. బెంగళూరు ఉత్తర లోక్‌సభ స్థానం నుంచి అభ్యర్థి కానున్నట్లు తెలుస్తోంది. మరో రెండువారాలలో లోక్‌సభ ఎన్నికలు వస్తున్న తరుణంలో ఈలోగానే కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే పదవికి వారంరోజులలోనే రాజీనామా చేస్తారనేది స్పష్టమవుతోంది. ఖాళీ ఏర్పడే యశ్వంతపుర స్థానం సోమశేఖర్ కుమారుడికి టికెట్ ఇచ్చేలా కూడా ఒప్పం దం కుదిరనట్లు తెలుస్తోంది. ఇలా అన్ని విధాల చర్చలు ముగిశాకనే సోమశేఖర్ బీజేపీ నిర్ణయాలను పాటించకుం డా వ్యతిరేకించినట్లు స్పష్టమవుతోంది.

